# గంగజాతర

ఊళ్ళో జాతర చాటింపు జరిగింది.

గంగజాతర ఈ వూళ్ళో చాల ప్రత్యేకమైనది. ఏడుచోట్ల ఏడు గంగల్ని నిలిపి దున్న పోతుల్ని వూరేగించి చివరిరోజు బలియిస్తారు. గంగలు వూరేగే వీధులన్నింటిలోనూ కుంభాలు పోస్తారు. వేయికళ్ళ కుండల్లో దీపాలు పెట్టుకుని కొందరాడవాళ్ళు, పిల్లలూ వేపచీరలు కట్టుకుని యింటి వద్ద నుండి గంగలు నిలిపిన చోటుకి వూరేగింపుగా వస్తారు. 'మావూరిని నీటి ఎద్దడి నుండి రక్షించమనీ, పిల్లలకు అంటువ్యాధులు సోకకుండా కాపాడమనీ... వూళ్లోని చిన్నా,పేద వర్గాలను ఈతిబాధల్లేకుండా చూడమనీ' గంగల్ని ప్రార్థించి వారివారి శక్తిమేరకు కోళ్ళని, వేటల్ని, దున్నపోతుల్ని బలియిస్తారు. జాతర రెండురోజులూ వూళ్లోని ప్రతీ యిల్లూ చుట్టపక్కాలతో నిండిపోతుంది.

గతంలో అయితే చాటింపు వేశాక వూళ్ళో నుండి ఎవరూ బయట ఊర్లకి వెళ్ళటానికి వీల్లేదు...ఇప్పటి కుర్రకారుకి

జాతర హడావిడే తప్ప స్థిమితం లేదు.

మా అత్తగారున్నంత కాలం మా యింట్లో కూడా జాతర తాలూకూ పూజలు జరిగేవి. ఆవిడ పోయాక సాంప్రదాయాలూ, పండుగల సందడీ కూడా చాలా వరకూ తగ్గిపోయాయి.

'అమ్మా... పది కాఫీలు" సురేషొచ్చి బిగ్గరగా అరవడంతో ఉలిక్కిపడి 'స్టౌ' మీద నుండి పాలు దించాను.

"అమ్మా... ఇడ్లీ పెట్టి చెట్నీ చేశాను, చాలా, యింకేమయినా చేయాలా? కూరలు ఏం చేయాలో చెప్తే నేను మార్కెట్టుకెళ్ళి తెచ్చుకుంటాను" వంటమనిషి రవణయ్య తొందర పెడ్తున్నాడు...చెప్పకుండాగాని నేను బయటకెళ్ళిపోతే ఏం చేయాలో తెలీక గింజుకుంటాడు. అదీ వాడి హడావిడి. నాకేమో వూపిరాడ్డంలేదు.

మా యింట్లో ప్రతిరోజూ జాతరే... రాజకీయ జాతర... పంచాయితీ ఎన్నికల ప్రకటన వెలువడింది. నామినేషన్ల పర్వం కూడా పూర్తయింది. ఇంటినిండా మనుషులు... అందరికీ అన్నీ సకాలంలో జరిగిపోవాలి. మాటిమాటికీ టీలు, కాఫీలు... కొందరికి భోజనాలూ... ఇల్లంతా చెప్పలేనంత హడావిడిగా వుంది. ఎవరు ఎవరితో ఏంమాట్లాడుతున్నారో అర్థంకావడంలేదు ఒక్కోసారి నాయింట్లో నేనే పరాయిదానిలా...

కప్పుల్లో కాఫీ పోస్తుంటే దిగులుతో గుండె, నీటితో కళ్ళు వొణికాయి.

"అరె అదేంటి మాధవీ యింకా నువు రెడీ అవలేదా? ఇట్లాంటప్పుడు కూడ వంట గదిలో ఏంటి? మీ ఆడపడుచు, తోడికోడలూ వచ్చారు కదా చూసుకుంటారు... మనకిక ఎక్కువ సమయం లేదు. తిరగాల్సిన ఏరియా ఏమో చాలా వుంది. యిట్లా అయితే గెలుపు అసాధ్యమవుతుంది..." హడావిడి పెట్టేసింది రాగిణి రాగానే. రాగిణి తండ్రి వాళ్ళూర్లో పెద్ద రాజకీయవేత్త. చిన్ననాటి నుండీ రాజకీయాల్లో పుట్టి పెరగడంతో రాజకీయాల పట్ల ఆసక్తీ, అభినివేశమూ వున్నాయామెకి. ఇదిగో అయిపోయింది... మీరంతా టిఫిన్లు చేయండి.... చెప్పాన్నేను. కాఫీ కప్పులు నిండిన ట్రేని సురేష్ కందిస్తూ. మా బృందంలో కొంతమంది టిఫిన్లు చేసొచ్చామనీ, మరికొందరు చేస్తామనీ లేచారు. రవణయ్యని పిలిచి వాళ్ళందరి బాధ్యత అప్పగించి నేను హడావిడిగా బాత్‌రూమ్‌లోకి దూరాను. మురికి పట్టిన శరీరాన్ని, మనసునీ కూడా ప్రక్షాళన చేసుకోవడానికి. ఇక్కడ జీవితమంటే ఉరుకులూ, పరుగులూ... ఒక్కక్షణం ఆలస్యమైనా ఒక జీవితకాలం వెనుకబడి పోతుందేమోనని భయం.

* * *

"రాజేంద్రరెడ్డి భార్య...వీర్రాఘవరెడ్డి కోడలు...పంచాయితీ ఎలక్షన్లలో సర్పంచ్‌గా నిలబడింది. మీకు రాజేంద్రరెడ్డి కొత్తకాదు... ఆయన ఈ వూరికి చేసిన సేవ మీకంతా తెలుసు. మీ ఓట్లన్నీ ఆమెకే ఏసి గెలిపించాల... మర్చిపోకండమ్మా... మీ ఎన్నికలగుర్తు ట్రాక్టర్... ట్రాక్టర్..."

"వద్దు నాకు గెలవాలని లేదు..." పెద్దగా అరవాలన్న కోరికని అతి బలవంతం మీద అణుచుకున్నాను.

"నాకు పేరు లేదు... జీవితం లేదు... గెలుపులేదు ఫలానా ఆయన కూతుర్ని, ఫలానా ఆయన భార్యని... యింకా...యింకా ఫలానా ఆయన అమ్మని అంతే... వద్దొద్దు నాకు గెలుపొద్దు... ఈ విజయం కూడా అతడిదే..."

"ఓమే... రమాదేవా రారా పరుగెత్తు. రాజేంద్రరెడ్డి భార్యొస్తే చెప్పమంటివే. వచ్చిందొచ్చింది రా....రా" సుబ్బలమ్మ కేక విని వెనకింట్లో వున్న సదరు రమాదేవి చేస్తున్న పనినొదిలేసి నా బృందంతో ఆమె యింటివైపుకి కదిలే లోపలే ఎదురొచ్చింది.

నేను నవ్వుతూ చేతులు జోడించాను.

గత పదిరోజులుగా వీధి వీధి తిరిగి ప్రతీ ఓటర్నీ వ్యక్తిగతంగా కలుస్తున్నానేమో నా పెదవులు సాగి సాగి అలాగే వుండిపోయాయి. జోడించిన నా చేతులు రెండూ అతుక్కుపోయాయి విడివడకుండా...అసూర్యంపశ్యయైన నా చర్మ సౌందర్యం ఒక్క సారిగా ఎక్స్‌పోజ్ అవడంతో కమిలి నల్లబారిపోయింది. పాదాలు పదిరోజుల నుండీ నా బరువుని మోసి మోసి నొప్పులతో మొద్దుబారి మొరాయిస్తున్నాయి. అంతా వీధివీధిలో రాజేంద్రరెడ్డి భార్య... రాజేంద్ర రెడ్డి భార్య అంటూ 'జూ'లో వింత జంతువుని చూసినట్లు చూస్తున్నారు. ఆత్మాభిమానం లేని నా శరీరం సిగ్గు తెరలనొదిలేసినట్లుగా వుంది. నాఆలోచనలు వేరు... అభిప్రాయాలు వేరు.. నేను జీవిస్తున్న జీవితం వేరు.

"మా ట్రాక్టర్ గుర్తుకే మీ ఓటు... మర్చిపోవద్దు.. ట్రాక్టర్ ....ట్రాక్టర్... మీకే సమస్య వచ్చినా అయ్య చూసుకుంటారు..." బతిమాల్తున్నాడు సిద్ధయ్య. అప్పుడప్పుడూ దబాయించినట్లుగానూ అరుస్తున్నాడు.

అవునవును! ఓట్లేసి అమ్మని గెలిపిస్తే అన్నీ అయ్య చూసుకుంటారన్నమాట. అన్నీ అయ్యే చూసుకుంటారు... అమ్మకేమీ తెలీదు... తెలియనివ్వరు. ఏం వ్యాపారం చేస్తున్నారో తెలీదు... ఎంత ఆదాయమొస్తుందో చెప్పరు. అంతెందుకు, నామినేషను వేయడానికి పది నిముషాల ముందు వరకూ కూడా నేను ఎలక్షన్లలో నిలబడబోతున్నట్లు నాకు తెలీదు. నా అభిప్రాయమెవరూ అడగలేదు. నేను యింట్లో సంతకం పెట్టిన నామినేషను కాగితాల్ని తీసుకుని అశేష ప్రజానీకంతో, జేజేల నడుమ అమిత అట్టహాసంగా అతడెళ్ళి దాఖలు చేసి వచ్చాడు. ఆ రోజు కూడా వంటపని నేనే చూసుకున్నాను, నామినేషన్ వేసి అతడు తిరిగొచ్చేసరికి వందమందికి భోజనాలు రెడీ అయ్యాయి. ఆ తర్వాత కానీ అర్థం కాలేదు. ఈ పంచాయితీ లేడీ రిజర్వుడు అయిందని, అతడెప్పుడూ నాకో ప్రహేళిక. బహుశా నా మౌనం అతడిని ఛేదించలేని ప్రశ్న కావొచ్చును.

నామినేషన్ వేసిన రోజునుండీ నా పుట్టింటి వైపు నుండీ, నా స్నేహితుల నుండీ ఫోన్ కాల్స్ రాసాగాయి.

"ఏంటి నువ్వు సర్పంచ్‌గా నిల్చున్నావా? ఏవిటే ఈ పని?"

"నీ ప్రవృత్తికి రాజకీయం ఎంత మాత్రం సరిపడదు. ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా?..."

"అతడు చెప్తే మాత్రం నీ స్వంత బుద్దేమయింది?. అతడేం చెప్తే అదేనా? మరీ డూ...డూ బసవన్నవయిపోతున్నావు..."

"కంగ్రాట్స్ డియర్"

అభినందలనీ, మందలింపులనీ బేరీజు వేస్తూ నాలో ఆలోచన మొదలైంది. తప్పు చేయటం లేదుకదా... ఎందుకిటువంటి నిర్ణయం తీసుకున్నాను. సంతకం పెట్టుండాల్సింది కాదా?... ఈ మధనని భరించలేక ఆ రాత్రి రవీంద్రకి ఫోన్ చేశాను... రవి నాకు మా అమ్మ తరపు బంధువు. ఒకవిధంగా చిన్ననాటి మిత్రుడు. నన్ను నాకంటే కూడా బాగా అర్థం చేసుకున్న వాడు. హైదరాబాద్‌లో డి.ఎస్.పి.గా పనిచేస్తున్నాడు. చాలా సిన్సియర్ ఆఫీసరని పేరు తెచ్చుకున్నాడు. ఈ సమయంలో నాకు సరయిన సలహా యివ్వగలిగింది తనే. ఒకవేళ రవి వద్దంటేనో? నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటుందా? ఉహు...

"మాధవీ, రాజేంద్ర మంచి నిర్ణయమే తీసుకున్నాడు. అంతా ఎవరికి వాళ్ళు నాకు రాజకీయం వొద్దు వొద్దు అంటూ దూరం దూరంగా జరిగిపోతే ఎట్లా?... మన జీవితం వరకూ మనకి ప్రశాంతంగా జరిగిపోతోంది చాలులే అనుకుంటాం అది చాలా తప్పు... రాజకీయం బురదగుంట, బురదగుంట అంటూ ముక్కు మూసుకుని కూర్చోకపోతే ఒక్కరయినా,దిగి బాగు చేయొచ్చుకదా... కనీసం ప్రయత్నించొచ్చు కదా... ఎలాగూ, సంతకం చేసేశావు కాబట్టి, డోన్ట్‌స్టెప్ బ్యాక్... నీవూరిని బాగుచేసుకోవడానికీ, పేదవర్గాలకు సాయం చేయడానికీ యిదొక అవకాశంగా తీసుకో... లైఫీ జె ఛాలెంజ్... ఫేసిట్... బి బ్రేవ్..." అంటూ ధైర్యం చెప్పాడు.

నాలో ఒక కొత్త ఉత్సాహమొచ్చింది.

"రండి...రండమ్మా...తమరొస్తారని నాలుగుదినాలుగా ఎదురుచూస్తుండా... నిన్నంతా అయితే ముంజలు ఒలిచి పెట్టుకోని చూసిచూసి మీరు రాకపోయేతలికి పక్కింటి పిలగాడి కిచ్చేసినా... రామ్మా కూర్చోమ్మా తల్లా... నువు నాకంటికి ఎప్పుడూ కనపడబోతావా అనుకుం టుండా"

ఆవిడెవరో తెలీక వింతగా చూస్తున్నా... నా చేతులు మాత్రం జోడించే వున్నాయి. నాపెదవులు సాగే వున్నాయి. బహుశా నా నుదురు ముడతపడిందేమో కుతూహలంతో.

"మనింటి కొస్తుళ్ళా అమ్మా ధర్మన్న అని... ఆ ధర్మన్న భార్య... ధర్మన్న యాక్సిడెంట్లో చనిపోయినపుడు రెడ్డిగారు చాలా సాయం చేశారీయమ్మకి... అందుకే అన్నంటే ప్రాణం" గొప్పగా చెప్పాడు వెంకటేశ్వర్లు.

"మనుషులకి సాయం కూడా చేస్తుంటాడా?" నా కళ్ళల్లో కదిలిన ఆలోచనలని గమనించినట్లుగా

"అవునక్కా అన్న దేవుడు.. భాస్కర్రావోళ్ళ వూళ్ళో గొడవలయితే వాళ్ళన్నదమ్ములందరి నుండి భాస్కర్రావుని కాపాడాడు... అప్పట్నుండీ భాస్కర్రావు అన్ననొదిలి పోడనుకో..." చెప్పాడు సురేష్. నిజమే, సురేష్ తల్లికి జబ్బు చేసినప్పుడు అతడు తన తల్లికే జబ్బు చేసినట్లుగా డాక్టర్లకి ఫోన్ చేసి... హాస్పిటల్ ఖర్చు భరించడం జ్ఞప్తికొచ్చింది.

మాదిగ చిన్నోడి కూతురి పెళ్ళి అన్న స్వయంగా దగ్గరుండి ఎలా జరిపించాడో కథలా చెప్పుకొస్తున్నాడు సురేష్. నాకు ఏవేవో కొత్త విషయాలు తెలుస్తున్నాయి. కోటివిద్యలూ ఓటు కొరకే అధికారాన్ని సాధించడానికీ, నిలుపుకోవడానికి మనుషులు అవలంభించే మార్గాలు అవగతమవుతున్నాయి. పదవీ కాంక్ష... ఎంత వారినయినా కీర్తికాంత ఎలా వశపరచు కుంటుందో... ఆ కాంత మందు సొంత కాంత దిగదుడుపే. నా అడుగులతో, సహనంతోనూ వీధివీధినీ, వాడవాడనూ కొలుస్తూనే ఉన్నాను. ఆ క్రమంలో...

"అమ్మా.. కాఫీ" అందించాడు వెంకటేశ్వర్లు.

"మాధవక్కా వీళ్ళు మాలోళ్ళు. వీళ్ళింట్లోనేంది మనం కాఫీ తాగేది... వొద్దు" గుసగుసగా చెప్పింది. నాతో వచ్చిన పట్టాభిరెడ్డి భార్య. మనుషుల్ని వాళ్ళ ముఖాలతోనూ, వ్యక్తిత్వాలతో గాక, కులంతోనూ, డబ్బుతోనూ మాత్రమే గుర్తిస్తారు. కొంతమంది. ఈ విషయంలో రాజేంద్ర ఆలోచనలు కొంత ఉన్నతంగా వుంటాయి. నేను ప్రచారానికి కదలబోయే ముందు మొట్ట మొదటి రోజు అతడు ప్రత్యేకించి చెప్పాడు నాతో.

"కేవలం నీ స్నేహితురాళ్ళనీ రెడ్లు, నాయుళ్ళ భార్యల్ని మాత్రమే నీ పక్కన పెట్టుకోకు. నాగయ్య భార్య, సురేష్ వాళ్ళమ్మ, చిన్నోడి భార్య జయ అందరినీ నీతో పాటు తీసుకెళ్ళు. మనకందరూ కావాలి. ఆ విషయంలో ఏ మాత్రం తేడా కన్పించకూడదు"... ఇది అతడు ఒకవేళ ఓట్ల కోసమే చెప్పి ఉండొచ్చునేమో... నిజంలో కూడా అతడికి కులం పట్ల చిన్నచూపు లేదు. కొన్ని కొన్ని విషయాల్లో అంత సమున్నత భావాలు గల వ్యక్తి మరికొన్నింటిని అసలే పట్టించుకోనట్లుగా ఎందుకుంటాడో అర్థంకాదు.

"అక్క కాఫీ తాగరు" చెప్తోంది విజయ వెంకటేశ్వర్లుతో. అతడు చిన్నబుచ్చుకున్నట్లుగా అయి "నిమ్మరసం తాగుతారా?" అన్నాడు.

"లేదు... లేదు తిరిగి తిరిగి అలసటగా వుంది. ఇప్పుడెలాగూ భోజనానికి వెళతాం ఏమీవద్దు... మంచినీళ్ళివండి చాలు..." అన్నానేను కర్ర విరక్కుండా, పాము చావకుండా, వాకిట్లో చెట్టుకిందున్న మంచం మీద కూర్చొంటూ చుట్టూ పరికించాను. మా అలికిడికి ఆ చెట్టుమీదున్న చాలా పక్షులు ఒక్కసారిగా గోలగోల చేస్తూ ఎగిరిపోయాయి. వాటిని చూస్తుంటే ఒకింత ఈర్ష్యగానూ, హాయిగానూ అనిపించింది. దూరంగా పంట పొలంలోని మోటార్లు శబ్దం చేస్తూ నీళ్ళను పారిస్తున్నాయి. ఆ నీళ్ళలో పశువులు కాసే పిల్లలు నలుగురైదుగురు ఎగిరెగిరి దూకి స్నానం చేస్తున్నారు. అలా వాళ్ళను చూస్తుంటే చిన్నప్పుడు మా తోటలో రవి,

నేను, శారద, చిన్ని అంతా ఈత కొట్టిన సంగతి జ్ఞప్తికొచ్చింది. నోస్టాల్జియా... మాటిమాటికీ నన్నావహించి యిబ్బంది పెడుతుంటుంది... ఇప్పుడు మరీ .

పదేళ్ళుగా ఈ ఊరిలో వుంటున్నానే కాని నాకీ పరిసరాలన్నీ కొత్తే. ఇది అటు పల్లె, ఇటు పట్నమూ కాని ఊరు. ఈ చుట్టు పక్కలన్నింటిలోకి ఇది మేజర్ పంచాయితీ. నాకు తెలిసినప్పటి నుంచి ఈ ఊరికి సర్పంచ్ రాజేంద్రరెడ్డే. ఈ పంచాయితీని మరొకరి చేతుల్లోకి అప్పగించడానికతడు సిద్ధంగా లేడు...

"అమ్మా ... బయల్దేరుదామా?" ప్రశ్నించాడు సిద్దయ్య. ఉలిక్కిపడి లేచి వారితో అడుగేశాను. ఈ రోజెందుకో నా కాళ్ళు ముందుకు సాగనంటున్నాయి. నా ఆలోచనలతోపాటు వెనక్కు నడుస్తున్నాయి. అది మాత్రమే అలవాటైన వాటిలా. ఈ సర్వం సహా సామ్రాజ్యానికి వారసుడొక్కడు చాలంటూ అతడు నా గర్భకోశాన్ని నియంత్రించినప్పుడూ, ఉన్న ఒక్కగానొక్కడ్నీ దగ్గరుంచుకొని చదివిద్దామంటే 'రాజకీయాల్లో ఉండేవాళ్ళు పిల్లల్ని దగ్గరుంచుకోవటానికి లేదంటూ' అతడు సాకేత్‌ని ఊటీ స్కూల్‌కు పంపేసినపుడూ అర్థమైంది నా కాళ్ళకు ముందుకు నడిచే శక్తి లేదని.

పగలంతా ఓట్లడుక్కొని, అరిగిపోయిన అరికాళ్ళను గోరువెచ్చటి నీళ్ళకప్పగించి బల్లమీద ఆన్చిన రెండు చేతుల్లోనూ నేను ముందుకు తలవాల్చినప్పుడు,యుద్ధ విరామపు రాత్రులలో శవాలను వెదుకుతూ మౌనంగా రోదిస్తున్న ద్రౌపదికి వారసురాలిలా వుంటాను. జీవితం నిండా అనేక రకాల యుద్ధాలు... మనం యుద్ధం చేయాలని ప్రారంభించక పోయినా, అని వార్యంగా యుద్ధంలోకి నెట్టబడుతున్నాం. ఏమాత్రం ఆసక్తి లేని రాజకీయాల్లోకి నేను నెట్టబడ్డట్లు... ఎవరో బెత్తం పట్టుకొని నాకిష్టం లేని పనిని చేయమని అదిలిస్తున్నట్లుగా వుందిది.

* * *

"ఏ మొహం పెట్టుకొని ఓట్లడగటానికి వచ్చావు?..... మీ ఇంటాయన బాగ జేసినాడు... ఆ కొరవా సరవా నువు జేస్తావు. ఇట్ట చూడమ్మా చూడు మా ఇంటి ముందర మురిక్కాలవ... వాకిట్లోకి రావడానికి నువ్విప్పుడెంత బాధపడ్డావు? ఒక్కనాటికే నీకట్లుంటే...దినమ్మూ మేమెట్టా ఛస్తున్నామో ఆలోచించు, మా బాధలు పట్టించుకునే వాళ్ళెవురమ్మా? ఈ పొద్దు నాటిక్కన్పడతాం మేము ఓట్లేసేదానికి.. ఇదయిపోతే మళ్ళీ మామొహం చూసేదెవరు? చాల్చాలు పోవమ్మా... ముందీ కాలవ పని చేయిస్తేనే మేమంతా ఓట్లేసేది... లేకుంటే మా వీధంతా ఓట్లకి రాదు..." మొహం మీద ఉమ్మేసినట్లయింది నాకు.

రాజగోపాలపురం రెండోవీధిలోనికి అడుగుపెడుతూ నల్లటి, బురద నీళ్ళని తప్పించుకోవడం కోసం తెల్లటి, నున్నటి నా లేత పాదాల్ని చీరకుచ్చెళ్ళతో పాటుగా ఎత్తెత్తి వేయడం, నాతో వచ్చినవాళ్ళంతా ముక్కులు మూసుకోవడం జ్ఞప్తికొచ్చింది. ఒకింత విసుగుపోయి తేరుకున్నాను.

ఆడశివంగిలా దూసుకొస్తున్న ఆమెను చూస్తుంటే నాకు చాలా ఆనందమైంది. ఈ పది పదిహేను రోజులుగా నాకీ వూరి ప్రజల మీద ఒక అభియోగముంది. ఈ పంచాయితీ యింత ఘోరంగా వుంటే ఓట్లడగటానికి నాయకులు తిరిగి తమ ముందుకొచ్చినపుడు 'ఊరికి ఏం చేశారనికానీ, కొళాయిల్లో నీళ్ళేవని గానీ, ఈ డ్రైనేజీ మాటేమిటని గానీ' ఒక్కరయినా ప్రశ్నించరేమిటి?.... ఈ వూరి ప్రజలకు ప్రశ్నించడం చేతగాదా అని... ఇప్పుడు ఈవిడిలా దులిపేయడంతో ఈ వూరిప్రజలకు ప్రశ్నించడం చేతనవునని చాలా సంతోషమేసింది. డ్రైనేజి పని తప్పకుండా చేస్తామని ఆమెకు వాగ్దానం చేసి సమాధానపరచి మరో దిక్కుకు మరలాం. ఆమె వెనుక నుండి నవ్వుకుంటున్నట్లుగా అన్పించింది నాకు.

మేము బజారువీధిలో నడుస్తుండగా ఆ కూడలిలో గుమికూడిన జనం మీదుగా శుష్క వాగ్దానాల మైకు ప్రవహిస్తోంది. రాజేంద్ర వాగ్దానాల పరంపరతో జనాన్ని ఆకట్టుకుంటు న్నాడు. మాటలు చెప్పడంలో రాజేంద్రనెవరూ బీట్ చేయలేరు. అతడి నాలుకకు రెండు వైపులా పదునుంది. గంభీరమైన గొంతుతో అతడు మైకు ముందు నిలబడితే అపోజిషన్ పార్టీ వాళ్ళు కూడా పన్లు మానుకుని నోళ్ళు వెళ్ళబెట్టాల్సిందే. మాట్లాడిన మాట మాట్లాడకుండా గంటసేపు తానీ వూరికి చేసిన పనులన్నింటినీ ఏకరవు పెట్టగలడు. వాదనలో అతడినెవరూ గెలవలేరు... లాయరు కాబోయి వ్యాపారం, రాజకీయాలలోకి దిగిన వ్యక్తి.

అలాగే మరో కూడలిలో మరో నాయకుడు. ఒకవైపు జాతర గంగల వూరేగింపు... ఊరంతా మైకుల సందడితో హోరెత్తుతోంది. ఆడవాళ్ళు గడపగడపకీ బొట్టుపెడుతూ ఓట్లర్థిస్తూ ఎడాపెడా తిరిగేస్తున్నారు బృందాలు బృందాలుగా. చాలా రోజులుగా దాచి వుంచిన చీరలన్నిం టినీ ప్రదర్శించానికో అవకాశమొచ్చినట్లుగా వున్నారు పెద్దింటి ఆడవాళ్ళు.

"ఎట్లా అయినా మీ ఓట్లన్నీ వేసి అక్కను గెలిపిన్చాల... నాకోసం నా మొహం చూసయినా సరే... అక్క గెలిస్తే నేను గెలిచినట్లే అనుకోండి..." వాళ్ళవీధిలోని ఓటర్లని బతిమాలు తున్నాడు కృష్ణారెడ్డి... ఈ మధ్యన రెండు మూడేళ్ళుగా దూరంగా వుండి ఇప్పుడే ఎన్నికల సమయంలో రాజేంద్రవద్దకొచ్చి చేరాడు కృష్ణారెడ్డి... పంచాయితీలో వున్న కాంట్రాక్టు పనులన్నీ తనకే కట్టబెట్టాలని అప్లికేషన్ వేస్తున్నాడు.. అందుకే కష్టపడి తిరుగుతున్నాడు నా గెలుపుకోసం...

"రాజేంద్ర రెడ్డికీ జై... వీర్రాఘవరెడ్డికీ జై ...ట్రాక్టరు గుర్తుకే మీ ఓటు మన పొలాలు దున్నేది ట్రాక్టర్... మనకి తిండి గింజలనిచ్చేది ట్రాక్టర్... మీ పవిత్రమైన ఓటు ట్రాక్టర్ గుర్తుకే... మీ ఓటు చెట్టుకేసి గెలిపించండి...." ఎదురుగా వస్తోన్న అపోజిషన్ బృందంతో మా బృందం తాలూకు జేజేలు కలిసిపోయి ప్రజల్ని ఒక అయోమయంలోకి నెడుతున్నాయి.

"రాజేంద్రరెడ్డి భార్య.. ఎప్పుడూ ఎండకన్నెరుగనిది... కార్పెట్టు మీది నుండి కార్లోకి తప్ప అడుగుపెట్టనిది... ఈ ఎర్రటి ఎండలో... ఈ మురికిలో మీముందుకు వచ్చింది. ఆ యమ్మని చూసయినా దయతల్చండమ్మా... మీఓటు ట్రాక్టరు గుర్తుకే వేయండి..." దండాల మీద దండాలు.

ఈ పరిచయాలేమిటో , ఈ దయతలిచే గొడవేమిటో నా కెంతకీ అర్థంకాదు... చేయగలిగిన పనుల గురించీ, ఊరి బాగోగుల గురించీ చెప్పకుండా యిదేమిటి? అయితే ఒకవిధంగా వీళ్ళే నయమేమో ఊరి బాగోగుల గురించి చెప్పకపోయినా తమను తాము పరిచయం చేసుకుంటూ ఓట్లడుక్కుంటున్నారు. అవతలి పార్టీ వాళ్ళట్లాకాదు... అపోజిషన్ని తిట్టడంతోనే సరిపోతోంది... ఆ విధంగా ఎన్ని ఓట్లు రాల్తాయో మరి... ఓట్లడుక్కోవడంలో కూడా నెగటివ్ మేనరిజమ్స్.

* * *

"అంతా బాగుండాదన్నా... ఎక్కడికి పోయినా మంచి రెస్పాన్స్... మనం వస్తుండామంటే చాలు జనాలు గుమికూడి ఎదురు చూస్తున్నారు. ఇంత రెస్పాన్స్ అపోజిషనోళ్ళు వచ్చినపు డుండటం లేదు. మనమే ఈసారి కూడా విన్" గొప్పలు చెప్తూ గాలిలో రెండు వేళ్ళు నిలబెడ్తు న్నాడు శేఖరయ్య.

ఎందుకిటువంటి పిక్చరిచ్చి ఉబ్బపెడ్తారో అర్థంకాదు. ఓటర్ల నాడి పట్టుకోవడం అంత తేలికయిన పనేమీకాదు. వాళ్ళు రాజేంద్రరెడ్డి భార్యొచ్చినా నవ్వుతూ "అట్నేలేమ్మా" అంటున్నారు. మరో రామినాయడు భార్యొచ్చినా ఆహ్వానిస్తున్నారు. ఇంకో బి.జె.పి. సోమశేఖరాన్నీ వాళ్ళలాగే రిసీవు చేసుకుంటున్నారు. ఓటర్ల ముఖాన్నిబట్టి మనం గెలుపోటములు నిర్ణయించడం సాధ్యం కాదు... మొన్నటి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో అంతేకదా... అంతా నిశ్శబ్ద విప్లవంలా సాగింది... అనుకోని ఫలితాలొచ్చాయి.

"అయినాసరే మనం ఎంత మాత్రం అజాగ్రత్తగా వుండటానికి వీల్లేదు... రాజగోపాల పురం అంతా సుబ్రమణ్యం చూసుకుంటాడు. పిచ్చిరెడ్డి తోపులో నువ్వున్నావు... బాలాజీనగర్‌లో లక్ష్మయ్య చూస్తున్నాడు.. ఆ పక్క బేరిపేటలో బాలయ్య వున్నాడు... ఎక్కడికక్కడే ఎప్పుడూ చాలా జాగ్రత్తగా వుండాలి మనం... డబ్బేదయినా కావాల్సివస్తే మురళినడిగి తీసుకోండి... తనే క్యాష్ చూస్తున్నాడు" సూచనలిస్తున్నాడు రాజేంద్ర అందరికీ. అతడి గొంతు చాలా ఖచ్చితం గా వుంది. కుటుంబ సంబంధాల్లో కూడ అతడి గొంతు యిలానే వుంటుంది.

"అన్నా....మందు అడుగుతుండారు" నసిగాడు శివకోటి.

"మందు సంగతి తర్వాత చూద్దాం... మనమిప్పుడెంత చేసినా ఆఖర్రోజిచ్చే పది రూపాయలే వాళ్ళకి రుచి... చేద్దాం... తప్పకుండా చేద్దాం.. ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు... పంచాయితీ మాత్రం మనచేతుల్లో నుండి మరొకరి చేతుల్లోకి పోవడానికెంత మాత్రమూ లేదు"

ఒక సువిశాలమైన సామ్రాజ్యాన్ని పరిపాలించడానికి జరుగుతున్న యంత్రాంగంలా వుందది. ఈ మొత్తం యంత్రాంగంలో నేనో చిన్న పనిముట్టుని మాత్రమే. ఇక్కడ డబ్బు,

మందు మంచినీళ్ళ ప్రవాహమై గెలుపోటములను నిర్ణయిస్తుంది. అంత డబ్బు ఈ విధంగా ఎన్నికల పేరుతో కుర్చీ కోసం ఖర్చు చేయకపోతే కడుపునిండా తిండికి నోచుకోని పేదలకు పంచరాదూ... పంచుతున్నారు... ఎందుకు పంచరూ...? ఓటర్లకి పంచుతున్నారు.

ప్రతీ యింటికీ గుర్తింపు చీటీలతో పాటుగా ఓటుకు ముప్పయి, యాభై, వందా... ఆయా ప్రాంతాలనుబట్టీ, ఎన్ని ఓట్లుంటే అంత డబ్బు కవర్లో పెట్టి పంపేస్తారు. వచ్చిన వాళ్ళందరికీ అడిగినన్ని సారా ప్యాకెట్లు. ఈ మదుపు పెట్టిందంతా రేపు రెట్టంపుగా సంపాదించ బడుతుంది... రాజకీయమంటే యిక్కడ వ్యాపారమే కదా...

* * *

వేపచీర కట్టుకుని దీపాన్నుంచిన వేయికళ్ళ కుండని చేతిలో పట్టుకుని ట్రాక్టరు మీద వూరేగుతున్నాన్నేను... ఆయనొక్కరి ముందు కూడా తెగ గింజుకునే నేను అంతమందిలో బట్టల్లేకుండా వేపాకు చుట్టుకుని ఎలా నిల్చున్నానో అర్థం కావడం లేదు...

జన ప్రవాహం మధ్యలో నుండి ట్రాక్టరు కదల్లేక కదులుతోంది... నా ప్రక్కనే రాజేంద్ర నిలబడి చేతులు జోడించి జనాన్ని చూస్తున్నాడు నవ్వుతూ... ట్రాక్టరులోని మైకు మాటలు మాటలుగా జనాన్ని తాకుతోంది.

గంగలు నిలిపిన కూడలి వద్దకు అనేకానేమంది ఆడవాళ్ళు వేపచీరలు కట్టుకుని వేయి కళ్ళ కుండలతో నడచి వస్తున్నారు...ప్రతీ కూడలి వద్దా పొట్టేళ్ళు, కోళ్ళు నరకబడు తున్నాయి...

తలలుతెగి రక్తం ఏరులై పారుతోన్న జీవాల్ని చూసి కొంతమంది ఆడవాళ్ళు వేప చీరలతోనే స్పృహ తప్పి నేలమీద పడిపోయి వున్నారు.

మధ్యమధ్యలో మైకుని తన చేతిలోకి తీసుకుని రాజేంద్ర ఓట్ల అర్థింపుని కొనసాగిస్తు న్నాడు. కళ్ళు తిరుగుతున్నట్లయి బలవంతం మీద నిలదొక్కుకుని నిలబడి వున్నాన్నేను. కొంతమంది పెద్దిళ్ళ వాళ్లు మేడల మీద నిల్చుని నన్నూ, నా వూరేగింపునీ జాలిగా చూస్తున్నారు. దూరంగా జనంలో నిలబడి రవి నాకేసి వింతగా చూస్తున్నాడు. కళ్ళల్లో భావాల్ని పట్టుకోవడం కష్టమైపోతోంది. అసలు రవీంద్రా కాదా అన్నది గట్టి తేల్చుకోబోయి అలాగే పక్కకి ఒరిగి పోయాను ట్రాక్టర్లో.

హఠాత్తుగా మెలకువొచ్చేసింది నాకు. ఊరేగింపు తాలూకు కలవరం నుండీ, ఆ ఉద్వేగం నుండీ తేరుకోవడానికి పది నిముషాలు పట్టింది. రాత్రి బాగా పొద్దుపోయిందేమో ఏడింటిదాకా మెలకువ రాలేదు... ఇవ్వాళే పోలింగ్... హడావిడిగా బాత్‌రూమ్‌లోకి దూరాను.

"ఆ టీచర్స్ కాలనీ పైపులైన్ల పని పూర్తయిందా?.. వాళ్ళంతా గొడవ పెట్టేస్తున్నారు... సురేష్ ఏడి?...హైస్కూలు వీధిలో స్లిప్స్ పంచడం మర్చిపోయారంట... అవసరానికి లేకుండా ఎక్కడ చచ్చారంతా?..." అరుస్తున్నాడు రాజేంద్ర అందరి మీదా.

"ఊరికి నీళ్ళు కావాలి... కాదు కాదు ఓటర్లకి నీళ్ళివ్వాలి... పైపు లైన్లేయించాలి...అదీ ఎన్నికలలోపే జరిగిపోవాలి. ఊరికి నీళ్ళు తెచ్చే హడావిడిలో వున్నావు గానీ... నీ హృదయంలో తడిలేకుండా పోతోందన్న సంగతే గుర్తించడం లేదు ప్రియతమా" ఒంటి మీద నీళ్ళు దిమ్మరించు కుంటూ ఆలోచనలోపడ్డాను.

"అమ్మా రెడీ అయ్యారా?...అడగమంటున్నారు" పిలిచింది పనిమనిషి.

"ఆ... ఆ... వచ్చేస్తున్నాను" హడావిడిగానే పనివాళ్ళందరికీ మందళ్ళు చెప్పి బయట పడ్డాను.

"అమ్మా ... ఈ అంకమ్మ మన వూరి గ్రామదేవత... మనస్ఫూర్తిగా నమ్మి మనమేది కోరుకుంటే అది జరిగితీరుతుంది... అంత సత్యమైన దేవత... మీక్కూడా దైవభక్తి చాలా ఎక్కువ కదా దణ్ణం పెట్టుకోండమ్మా..."

చాలా రోజుల తరువాత నాకు చెప్పలేనంత నవ్వొచ్చింది.

"నిజమే తనకి దైవభక్తి చాలా ఎక్కువ... ఎందుకెక్కువయింది?... ఇదివరకు లేదే... అతడి నీడలో ఈడ్చే బ్రతుకు చప్పదనాన్ని, అతని నిర్లక్ష్యాన్ని తట్టుకోవడం కోసం, విలువల ముళ్ళ కిరీటాన్ని జాగ్రత్తగా ధరించే క్రమంలో నేను దేవుణ్ని ఆశ్రయించాను. నా ఆలోచనల న్నింటినీ మౌన కందకాల్లో దాచివుంచి ఆ ఒత్తిడిని హిస్టీరియా రూపంలో వెళ్ళగక్కడం కన్నా భక్తి సుగమమైన దారి అన్పించింది... మరో దారి లేక దేవుడి మీద నమ్మకం పెంచుకున్నానేమో...

"అమ్మా వెళ్దామా?"

"ఊ " అంటూ ఉలిక్కిపడి అంకమ్మకేసి నిశితంగా చూశాను.

మనస్ఫూర్తిగా కోరుకున్నాను అసంకల్పితంగా నన్ను ఓడించమని. రాజేంద్ర ఓవర్ కాన్ఫిడెన్స్‌కీ, అహానికీ నా ఓటమి పెద్ద దెబ్బ కావాలి. పోరాటం ఎంత గొప్ప విషయమో ఓటమి అంత సహజమైనది అని తెలియాలి. పోరాటం చేయలేక పోవడంలోని అశక్తత నన్ను కృంగదీస్తోంది. నా మనసొక నిశ్చింతను కోరుకుంటోంది.

అంకమ్మగుడి నుండి పోలింగ్ బూత్‌లవైపుగా కదిలింది కారు.

"రాత్రి తోపులో పిల్లకాయలంతా నిద్రపోలేదమ్మా... అపోజిషనోళ్ళు డబ్బు, సారాయి పంచుతారని కాసుకోనున్నారు..." చెప్పాడు చంద్ర ఉత్సాహంగా.

"మరి మీరూ పంచారుగా" అనబోయి ఊరుకున్నాను.

"అందర్నీ తరిం తరిం కొట్టామక్కా ... ఒక్కడు వాడుండాడే ముసురాజా వాడు మాత్రం దొరికిపోయాడు.. వాయించి పారేశారనుకో మనోళ్ళు... నడుం యిరిగిపోయింది వాడికి... ఈ పొద్దు ఓటేసే దానిక్కూడా రాడోడు..." తాము చేసిన ఘనకార్యాన్ని నా ముందుంచాడు చంద్రశేఖరం.

"అదేంటి చంద్రా...ఎలక్షన్లంటే ప్రచారం చేసుకోవాలి... ఓట్లడగొచ్చు... గెలవాలని అనుకోవచ్చు కానీ ఈ కొట్లాటలేంటి? దెబ్బలేంటి... మనిషిని మనిషి కొట్టుకోవడం అమానుషం కదా" చెప్తుంటే వూరికే వుండలేక ప్రశ్నించాను...

"అక్కా మంచితనంతో ఓట్లు రాలవక్కా... అదంతా ఆ కాలం... ఇప్పుడంతా ఏవంటే ఏవని ఎదుర్కొనేటట్టుండాల...అసలు రాజకీయమంటేనే ధనాధన్ ఫటాఫట్... అంతే"... ఉద్వేగంతో చెప్పాడు మళ్ళీ అతడు. ఉదయం ఓట్లేసి వస్తుంటే మన ఫ్యామిలీ డాక్టర్ని రామి నాయుడు మనుషులు అడ్డగించారు. అంతే మన పిల్లకాలయలు దెబ్బల్తోనే సమాధానం చెప్పారు. పారిపోయారు దొంగనాయాళ్ళు.

చంద్ర మొహంలోని విజయగర్వం చూస్తుంటే నాకు ఆశ్చర్యమైంది.

నిజమే రాజకీయమంటేనే గూండాయిజం.

గూండాయిజం ప్లస్ డబ్బు ప్లస్ సారా - రాజకీయం - వ్యాపారం.

మగాడికి యింట్లో, బయటా కూడా బంధమనేది వ్యాపారమయమైపోయింది.

మాట్లాడే మాటల్ని, నిముషాల్ని కూడా డబ్బుతోనే కొలుస్తున్నారు.

"ఇది పదో నెంబరు పోలింగ్ బూత్ అమ్మ దిగండి"

నాతోపాటుగా వచ్చిన రాగిణి , సౌజన్య, విజయ, విమల అంతా దిగారు.

"మాధవక్కా... ఈసారి మనం కారెక్కినపుడు ఆ లేబరోళ్ళని మనతోపాటు ఎక్కొద్దని చెప్పండి... మా జీప్‌లో రమ్మనండి..." సాధించినట్లుగా అన్నది విజయ... నేను విజయకేసి వింతగా చూశాను. ఆ లేబరోళ్ళ ఓట్లు పోగేసుకుని మనం అందలం ఎక్కాలి కానీ వాళ్ళతో కలిసి ఒకే కార్లో మాత్రం కూర్చోరాదు. బావుంది...ప్చ్...

"మాధవెందుకో దిగులుగా వుందీ రోజు" నా మౌనానికి పరిపరి విధాలుగా ఆలోచనలు పోతున్నారు నాస్నేహితురాళ్ళు. నిజానికి వీళ్ళు నా స్నేహితులు కారు, మా వారి స్నేహితుల భార్యలు. వీళ్ళెవరితోనూ నా ఆలోచనలు కలవవు.

"ఓడిపోతామని భయమేమో..." మెల్లిగా అంటున్నది విమల.

"కాదు కాదు ఓడిపోతామని నాకు భయం లేదు" గొంతెత్తి పెద్దగా అరవాలన్పించింది. కానీ మనకి అన్పించినవన్నీ చేసుకుంటూ పోతే మరీ అబ్సర్డ్‌గా వుంటుంది.

పిచ్చిరెడ్డి తోపు, కరెంటాఫీసు, బోర్డు స్కూలు, హైస్కూలు బూత్‌లన్నీ వరుసగా చూసుకుంటూ, గర్ల్స్ హైస్కూల్ వద్దకి రాబోతుండగా ఒక 'సుమో' సర్రున దూసుకు వచ్చి నా ముందాగింది... అది మాకారే... ఎ.పి.26..2223... అందులో రాజేంద్ర వున్నాడు.

"అన్న పిలుస్తున్నాడు" సురేష్ పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు ఒగరుస్తూ... నేను మెల్లిగా అటుకేసి నడిచాను. అప్పటికే రాజేంద్ర కూడా కారుదిగి నావైపు రెండడుగులువేశాడు.

"ఎట్లావుంది ?" ప్రశ్నించాడతడు.

"నేను చూసినంత వరకూ బాగానే జరుగుతోంది...." చెప్పాన్నేను నిజమో, అబద్ధమో తెలీక సందిగ్ధంగా.

"ఊ...మూడో నెంబరు బూత్ వద్ద గలాటా జరుగుతోందట... నువ్వింక యింటికెళ్ళి పో... తిరిగింది చాలు... నేన్చూనుకుంటాను"చెప్పాడతడు సిగరెట్టు వెలిగించుకుంటూ. నేను విస్తుపోయి చూస్తున్నాను అతడికేసి.

'చెప్పింది చెయ్యి' అన్నట్లుగా చూసి, అతడు తన కారుకేసి నడిచాడు.

బండెడు సామాన్లతో, బస్టాండులో బస్సు కోసం ఎదురు చూస్తున్న బాటసారిని ఎవరో పరిచితుడు 'సామాన్లు జాగ్రత్తమ్మా' అంటూ హెచ్చరించి వెళ్ళిపోయినట్లుగా వుంది.

"ప్చ్" నాలుకెగరేసి నేనూ అతడిని పట్టించుకోనిదానిలా వెళ్ళి కారులో కూర్చున్నాను. నా కారు మూడో నెంబరు బూతువైపుగా సాగిపోయింది.

"అక్కడ రామినాయుడు భార్యని కొట్టారట మనవాళ్లు... చాలా గందరగోళంగా వుంది... అక్కడికొద్దమ్మా... " చెప్పాడు డ్రైవరు.

"ఫర్వాలేదు... నేను ఓటేయ్యాల్సింది అక్కడే" చెప్పాన్నేను ఖచ్చితంగా. నాతో వచ్చిన మిగతా వాళ్ళంతా కొంచెం భయపడుతున్నారు అక్కడికి రావడానికి. ఏదో గుసగుసపోతూ మాట్లాడుకుంటున్నారు.

అయితే మేము వెళ్ళేసరికి అక్కడ చాలా ప్రశాంతంగా పోలింగ్ జరుగుతోంది. గొడవ తాలూకు శకలాలేమీ కన్పించలేదు.

నేను కారుదిగగానే ఆ బూతువద్ద వున్న నాగరత్నం పరుగెత్తుకుంటూ ఎదురొచ్చాడు. లోపలికెళ్ళగానే నాతరపు పోలింగ్ ఏజంట్లు గౌరవ సూచకంగా లేచి నిల్చున్నారు. వారిని కూర్చోమని సైగచేసి వేలికి చుక్క పెట్టించుకుని బ్యాలెట్ పేపరు తీసుకుని చేతిలో స్టాంపుతో లోపలికి నడిచాన్నేను.

"ఫర్వాలేదమ్మా మీరిక్కడే వేసెయొచ్చు" అన్న పోలింగాఫీసరు మాటల్నిపట్టించు కోకుండా. ఒక్కసారి బ్యాలెట్ పేపర్ని పైనుండి కింది దాకా చూశాను. నాకెందుకో నవ్వొచ్చింది నా పేరు చూస్తుంటే... ట్రాక్టరు గుర్తు మీద ఓటుని ముద్రించాను. ఒకసారి సాలోచనగా చూసుకున్నాను. ఆ తర్వాత నిదానంగా చెట్టుమీద, యింకా రెండాకుల మీద, గంటమీద, విమానం మీద, పొట్టేలు మీదా అన్నింటి మీద సమానంగా ముద్రించేశాను.

పట్టరాకుండా వున్న నవ్వుని అతి ప్రయత్నం మీద ఆపుకుంటూ నిటారుగా బయటికి నడిచాన్నేను. ఆ రాత్రే జాతర ఊరేగింపు ముగిసింది. గంగల్ని ఊరేగించి తీసుకెళ్ళి ఏట్లో కలిపేశారు. వూరంతా ఆదమరచి నిద్రపోయింది.

* * *

అయితే అనుకున్నదొక్కటీ...అయినది ఒక్కటీ...బోల్తా కొట్టిందిలే...

"ఎప్పుడూ అడుగుపెట్టని దొరసాని ఈ విధంగా ఆఫీసుల చుట్టూ తిరగడమంటే మాటలా? అయినా యియ్యంతా ఆడోళ్ళు చేసే పన్లు కాదులే" ఆడవాళ్ళు చేసే పనులంటూ వేరే వుంటాయా? బహుశా వాళ్లదృష్టిలో వంటా, ఇంటి సంరక్షణ, పిల్లల పెంపకమూ కావొచ్చు.

"అయినా యిదంతా ముప్పయిమూడు శాతం రిజర్వేషను మహిమ ప్చ్" పెదవి విరుస్తున్నారు కొంతమంది. హయ్యో... ఆ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టడానికే ఈ మధ్యన ఎంత గొడవయిందో గుర్తొచ్చింది.

"ఆ ఆడవాళ్ళేం చేస్తార్లేయ్యా... వచ్చినా వాళ్ళేం పాటుపడ్తుండారు. వాళ్ళ వల్లేమవు తుంది?... కాకుంటే ఓట్లు రాబట్టుకోవడం కోసం మహిళల్ని ఉద్ధరించినట్లు, చేసినట్లు ప్రభుత్వం జిమ్మిక్కులే గానీ, రాజ్యమేలడం ఆడవారి వల్లేమవుతుంది" వ్యంగపు బాణాలు.

నిజమే డిక్లరేషన్ ఫారమ్ అందుకోవడానికి కౌంటింగ్ ఆఫీసుకి స్వయంగా వెళ్లాల్సి వచ్చింది. మళ్ళీ ఈరోజు పన్నెండుగంటలా అయిదు నిముషాలకి మంచి ముహూర్తం కావడంతో ప్రమాణ స్వీకారం చేయడం కోసం పంచాయితీ ఆఫీస్‌కి వెళ్ళాను. అప్పుడు నా వెన్నెముక నిటారుగా వుందేమో.

"ఆ ఈ రోజంటే ప్రమాణ స్వీకారం చేయడానికొచ్చింది కానీ ఆమెదేముంది అంతా రాజేంద్రరెడ్డిదే కదా... ఆయన రానిస్తాడా ఈమెని ఆఫీసుకి... సంతకాలు మాత్రం చేయించు కుంటాడింటికాడ..." తెలీనితనంతో స్వచ్ఛంగా అంటున్నాడో, తెలిసి వ్యంగ్యంగా అన్నాడో కానీ అతడన్న మాటలు క్లియర్‌గా నా చెవినపడ్డాయి. నిజమే యివాళా రేపు ప్రతిచోటా జరుగుతున్న భర్త చాటు భార్య రాజకీయాలు గురించే వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. దీని గురించి తప్పు పట్టడానికేమీ లేదు.

అందుకు తగ్గట్టు ఉన్నత పదవులంకరించిన చాలా మంది స్త్రీలు సమస్యల పట్ల దృష్టి కేంద్రీకరించకుండా ప్రారంభోత్సవాలతోనూ, సన్మానాలతోనూ సరిపెట్టుకుంటున్నారు. అట్టా కాకుండా వేరు పురుగులాంటి సమస్యల పట్ల దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించుకున్నా న్నేను.

* * *

గాఢ సుషుప్తిలో వున్న లోకానికి సుప్రభాతం పాడుతోంది కోడి ఎక్కడో. రాత్రంతా మావగారూ, రాజేంద్ర యిద్దరూ పంచాయితీ గురించి చాలాసేపు మాట్లాడుకున్నారు. అందులో భాగంగా నేను పంచాయితీ ఆఫీసుకి వెళ్ళాల్సిన అవసరం లేదని చర్చించి నిర్ణయం తీసు కున్నారు. నేను వాళ్ళ మాటల్లో ఏమీ కల్పించుకోలేదు.

ఏ మహిళ అయినా పార్టీ పేరు చెప్పుకుని భర్త చాటు రాజకీయం చేస్తూ మనుగడ సాగించడం కంటే చురుగ్గా వ్యవహరిస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోగలగాలి. కొత్త వెలుతురులోకి వెళ్తున్నట్లుగా నాలో ఏదో మార్పు.

వందల వేల ఏళ్ళ నుండీ మగాడు రాజ్యమేలుతున్న సింహాసనాన్ని స్త్రీ గెలుచుకోవడం ఎంతో బావుంది. ఆదర్శాలు వల్లించడం స్త్రీకి చేతగాకపోయినా సమానత్వం, న్యాయం, నిజాయితీలను ఆమె ప్రేమిస్తుంది.

అకౌంటెంట్‌కి ఫోన్ చేసి పంచాయితీ పాత అకౌంట్ పుస్తకాల్ని, మిగిలిన అన్ని లెక్కల్ని తీసుకుని ఉదయం పదింటికల్లా ఆఫీసుకొచ్చేవయమని చెప్పాను. నాగొంతులోని ఖచ్చితత్వానికీ, లెక్కల్ని తిరగదోడాలన్న నా ఆలోచనకీ ఖంగు తినుంటాడతడు బహుశా...

కొత్తగా వేలికి తొడిగిన రాజముద్రికతో అవినీతిని సాధికారికంగా ఝళిపించగలగడం ఎంత బావుంది?... సుదీర్ఘ కాలంగా జరిగిపోయిన గాథల్నీ, దు:ఖాల్ని తిరగరాయడం కోసం ఈ ప్రపంచాన్ని మన చేతుల్లోకి తీసుకోగలగడం ఎంత బావుంది?...

పోరాటమిచ్చే ఆనందపు అనుభవాన్ని తడుముతూ నేను దుప్పటి తొలగించాను...

లోకాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం కోసం ఆ రోజు సూర్యుడు అయిదున్నరకే మబ్బుమాయల్ని ఛేదించుకుని వెలుగురేఖల్ని ప్రసరిస్తున్నాడు.

ప్రజాశక్తి ఆదివారం సంచిక, మే 2000